ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 28.01.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో బొగ్గు గనులు మూతపడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు.

2. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో పొత్తులకు సంబంధించి పీసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

3. రాష్ట్రంలో అవినీతి రహిత రిజిస్ట్రేషన్ల కోసం కీలక సంస్కరణలు తీసుకువస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు.

4. గిరిజన కుంభమేళాగా ప్రఖ్యాతి గాంచిన మేడారం లోని సమ్మక్క, సారలమ్మల జాతర ఈరోజు ఘనంగా ప్రారంభమైంది.

**కిషన్ రెడ్డి**

బొగ్గు గనులు మూతపడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. గనులు మూసివేసిన తర్వాత సంబంధిత ప్రాంతాలను స్థిరీకరించి అభివృద్ధి చర్యలు చేపట్టాలని ఆయన సింగరేణి గనుల అధికారులను ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. మంచిర్యాల జిల్లాలో గనులు మూతపడిన ప్రాంతాల్లో సామాజిక అభివృద్ధి కోసం 115 కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆయన తెలిపారు. గనుల మూత కార్యక్రమం అనంతరం ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయడం, క్రీడా ప్రాంగణాలను

నిర్మించడం, పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడం వంటి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గనుల మూసివేతకు ముందు, తర్వాత ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమంలో ఎప్పటికప్పుడు అప్ లోడ్ చేయాలని కిషన్ రెడ్డి చెప్పారు.

పిటిసి, మంచిర్యాల

**భట్టి**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల విషయంలో పొత్తులకు సంబంధించి పీసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని, రాష్ట్ర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన ఈరోజు ఖమ్మం జిల్లా, మధిరలో చెప్పారు. పార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆయన శాసనసభ్యులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ఉమ్మడి కుటుంబంలా పని చేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు.

పిటిసి, ఖమ్మం

**వింగ్స్ ఇండియా**

దేశంలో దాదాపు 350 విమానాశ్రయాలను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని , స్వదేశీ తయారీని సులభతరం చేయడానికి కృషి చేస్తోందని పౌర విమానయాన మంత్రి కింజరపు రామ్ మోహన్ నాయుడు చెప్పారు. దేశీయంగా విమానాలను తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని కూడా తెలిపారు. ఈ రోజు హైదరాబాద్‌లో వింగ్స్ ఇండియా 2026 ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలో విమానాల తయారీ ఈకో సిస్టం అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలు సామాన్య ప్రజలు కూడా విమాన ప్రయాణం చేయడానికి వీలు కల్పించాయని పేర్కొన్నారు. ఆదానీ ఏరోస్పేస్ , బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రేయర్ సంస్థల మధ్య ఇటీవల కుదిరిన కీలక

ఒప్పందం పౌర విమానయాన చరిత్రలో ముఖ్యమైనదని మంత్రి చెప్పారు. 20 దేశాల నుండి 3వేల మందికి పైగా వ్యాపార ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

**బైట్ – రామ్మోహన్ నాయుడు**

ఎంఎస్ఎం

**పార్లమెంట్..రాష్ట్రపతి**

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్రామ జీ రామ్ జీ అనే పథకాన్ని అమల్లోకి తెచ్చిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఈ నూతన చట్టం కింద ఏడాదిలో 125 రోజుల హామీ ఉపాధి కల్పిస్తుందని చెప్పారు. బడ్జెట్ సమావేశాల తొలి రోజున పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ , కేంద్ర ప్రభుత్వ దృఢమైన విధానాలు , కార్యక్రమాల వల్ల వ్యవసాయ ఉత్పత్తి వేగంగా పెరిగిందని, ఆహార ధాన్యాలు ఉద్యానవన పంటల ఉత్పత్తి చరిత్రాత్మక స్థాయికి చేరిందని వివరించారు. ఇప్పటి వరకు వెనుకబడి ఉన్న పంటల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వంట నూనెలు, నూనెగింజలు పప్పుధాన్యాలను పెంచడం ద్వారా వాటి దిగుమతులు తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.దేశం ప్రపంచంలో మూడో అతి పెద్ద స్టార్టప్ కేంద్రంగా నిలిచిందని , ఐటీ, ఐటీఈఎస్ రంగాల్లో కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని రాష్ట్రపతి వెల్లడించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో ప్రగతి సాధించామని , ఆపరేషన్ సిందూర్ మన సైనిక సత్తా చాటిందని , మన దేశంపై దాడికి దిగితే పరిణామాలు ఎలా ఉంటాయో ప్రపంచ మొత్తం చూసిందని. , రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో పెరిగాయని పేర్కొన్నారు. కాగా పార్లమెంట్ లో రేపు ఆర్థిక సర్వేని , వచ్చే ఆదివారం-ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడతారు. బడ్జెట్ తొలి విడత సమావేశాలు వచ్చే నెల ఫిబ్రవరి 13 వరకు. రెండో విడత సమావేశాలు మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. బడ్జెట్ సమావేశాలలో మొత్తం 30 సార్లు సభ సమావేశమవుతుంది.

ఎన్ఎస్ డీ

**పొంగులేటి**

రాష్ట్రంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూభారతి చట్టం ఉపకరిస్తుందని, అవినీతి రహిత రిజిస్ట్రేషన్ల కోసం కీలక సంస్కరణలు తీసుకువస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరు మండలం, కర్దనూరు గ్రామంలో నిర్మించే సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కార్యాలయాలను అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నామని, మొదటి విడతగా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధి హన్మంత్ మాట్లాడుతూ... రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రాష్ట్రానికి ఏటా సుమారు 14 వేల 500 కోట్ల రూపాయలు సమకూరుతుందని తెలిపారు.

పిటిసి, సంగారెడ్డి

**కిసాన్ మేళా**

రైతులు ఒకే పంటను కాకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని, ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం , పాలెం గ్రామంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో కిసాన్ మేళాను ఆయన ప్రారంభించారు. వ్యవసాయంలో శాస్త్రీయతను జోడించి అధిక దిగుబడులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి , తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పిటిసి, నాగర్ కర్నూల్

**మంచిర్యాల**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని, రాష్ట్రాన్ని అప్పుల మయం చేసిందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఫోన్లు ట్యాప్ చేసి ప్రజల గోప్యతకు భంగం కలిగించిం దని ఈరోజు మంచిర్యాలలో విలేకరుల సమావేశంలో అ న్నారు. వచ్చే పురపాలక సంఘాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పిటిసి, మంచిర్యాల

**మేడారం జాతర**

గిరిజన కుంభమేళాగా ప్రఖ్యాతి గాంచిన మేడారం లోని సమ్మక్క, సారలమ్మల జాతర ఈరోజు ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతోంది. జాతరకు వెళ్లే భక్తులు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మతిస్థిమితం లేని వారు తప్పిపోకుండా ఉండేందుకు జియో ట్యాగింగ్ అమలు చేస్తున్నామని వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత చెప్పారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద జియో ట్రాకింగ్ ట్యాగ్ వేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే భక్తులు కూడా వారి పిల్లలకు ఈ ట్యాగింగ్ వేయించుకోవాలని సూచించారు. జాతరకు వెళ్లే భక్తులు వాహనాలను జాగ్రత్తగా నడపాలని, ముందు వాహనాలను అతిక్రమించడం, వేగంగా నడపడం ప్రమాద కారణాలవుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ప్రజలు ముఖ్యంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

**సౌండ్ బైట్ : సస్ ప్రీత్ సింగ్ వరంగల్ సిపి**

డెస్క్/పిటిసి, వరంగల్

**కరీంనగర్**

కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ నగర పాలక సంస్థ, జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి పురపాలక సంఘాల ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇప్పటి వరకు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియాతో మాట్లాడుతూ...

బైట్ ... గౌస్ ఆలం

పిటిసి, కరీంనగర్